సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 18 । మే । 2023



నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం మిగులు జలాల విడుదలను పెంచారు. బుధవారం సాయంత్రం బ్యారేజీ నుంచి 12,314 క్యూసెక్కుల మిగులు జలాలను వదిలారు.



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బొట్ట వెంకటేశ్వరరావు (విజయవాడ) బుధవారం రూ.1,00,116 విరాళాన్ని సమర్పించినట్టు ఇన్‌చార్జి పీఆర్వో వెంకట రమణ తెలిపారు.



నగరం	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.5	29.0
కాకినాడ	37.1	30.3
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

డీఎస్పీగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



మంత్రి వేణును మర్యాద పూర్వకంగా కలిసిన డీఎస్పీ ప్రసాద్

రామచంద్రపురం: రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా టీఎస్ఆర్‌కే ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ డీఎస్పీగా ఉన్న ప్రసాద్ ఇక్కడకు డీఎస్పీగా బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటి వరకు డీఎస్పీగా పనిచేసిన ఎం.బాలచంద్రారెడ్డి టెక్కలి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ ప్రసాద్ రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

వేగంగా రీ సర్వే



కొత్తపేటలో రీ సర్వేపై సమీక్షిస్తున్న జేసీ ధ్యానచంద్ర

కొత్తపేట: గ్రామాల్లో రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ ధ్యానచంద్ర రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందికి సూచించారు. కొత్తపేట గ్రామ రీ సర్వేకు సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న భూమి నిర్ధారణ ప్రక్రియను బుధవారం జేసీ పరిశీలించారు. గ్రామంలో విస్తీర్ణం, దానిలో ప్రభుత్వ భూమి ఎంత? జిరాయితీ ఎంత? ఇంతవరకూ ఎంతమేర రీ సర్వే పూర్తయ్యింది? అనే వివరాలపై సర్వే సిబ్బందిని ఆరా తీశారు. మొత్తం 3,454 ఎకరాల విస్తీర్ణ కాగా 650 ఎకరాల ప్రభుత్వ భూములు, 2,854 ఎకరాల పల్లం, మెరక జిరాయితీ భూమిగా గుర్తించినట్టు సర్వే సిబ్బంది తెలిపారు. డివిజన్, మండల పరిధిలో రీ సర్వే స్థితిగతులపై ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబుతో సమీక్షించారు. రీ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. కౌలు భూములకు సంబంధించి కౌలు రైతుల ద్వారా భూ యజమానులకు సమాచారం ఇచ్చి, ఆ భూములకు సంబంధించిన రికార్డులు పంచాయతీలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీ ఎస్.శ్రీనివాస్, వీఆర్‌ఓలు కె.వీరేంద్ర, దుర్గ, మహాలక్ష్మి, సుభాషిణి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద 2023–24 సంవత్సరానికి పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు అభ్యసించడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, కాపు, ఈబీసీలకు చెందిన అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద ఎంపికైన వారికి 100 శాతం ట్యూషన్ ఫీజు మంజూరు చేస్తామని వివరించారు. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.8 లక్షలకు మించకూడదు. నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నాటికి గరిష్ట వయస్సు 35 సంవత్సరాలు మించకూడదు. ఆదాయ ధ్రువీకరణ పత్రం నిర్దేశించిన ఫార్మాట్‌లో ఉండాలి. క్వాలిఫైయింగ్ కోర్సుల్లో 60 శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ఎంబీబీఎస్‌లో చేరాలనుకునే విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించాలి. అభ్యర్థులు https://jnanabhumi.ap.gov.inలో అందించిన వెబ్ లింక్ ద్వారా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 10వ తేదీ అని జ్యోతిలక్ష్మీదేవి వెల్లడించారు.

19న పీజీటీ పోస్టులకు కౌన్సెలింగ్

కాకినాడ సిటీ: పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పాఠశాలల్లో పీజీటీ పోస్టులకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. డీఈఓ అన్నపూర్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులపై సీనియారిటీ అభ్యంతరాలు ఉంటే ఈనెల 18వతేదీ లోపు తమ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. దరఖాస్తుదారులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు పొంది బీఈడీలో మెథడాలజీ కలిగి ఉండాలన్నారు. ఈ నెల 19న కాకినాడలోని తమ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమ్యాటిక్స్, బోటనీ, జువాలజీలకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి తెలుగు, ఇంగ్లిష్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ పోస్టులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.



గిర్రున మీటర్లు

- గుబులు పుట్టిస్తోన్న ఎండ వేడి
- ఆగకుండా తిరుగుతున్న ఏసీలు..ఫ్యాన్లు
- గతేడాదితో పోల్చితే భారీగా వినియోగం
- బిల్లులు పెరుగుతున్నా లెక్క చేయని జనం
- విద్యుత్ వాడకంలో కాకినాడ జిల్లా ప్రథమం

సాక్షిప్రతినిధి,కాకినాడ: వేసవి ప్రభావం విద్యుత్ వినియోగంపై పడుతోంది. ప్రతి ఇంటా విద్యుత్ మీటర్ గిర్రున తిరుగుతోంది. నెల బిల్లులు రెట్టింపు అవుతున్నాయి. అయినా జనం ఎడాపెడా కరెంటు వాడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ నెలలో వాడకం బాగా పెరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గృహ విద్యుత్ వినియోగం 50శాతం పైనే ఉందని ఏపీఈపీడీసీఎల్ వర్గాలు లెక్కలేస్తున్నాయి. గడచిన రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఫలితంగా ఏసీల వినియోగం పెరిగింది. ప్రస్తుతం రోజూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యుత్ లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, రాత్రి 8 నుంచి తెల్లవారే వరకు ఏసీలు వాడుతున్నారు. గడచిన ఏప్రిల్‌లో మధ్యాహ్నం ఒక గంట, రాత్రి రెండు, మూడు గంటలు మాత్రమే ఏసీలు, ఫ్యాన్‌లు వినియోగించేవారు. ఇప్పుడు ఏసీలతో పాటు ఫ్యాన్‌ల వినియోగం కూడా మూడొంతులు పెరిగిపోయింది. మార్చి, ఏప్రిల్‌తో పోలిస్తే మే వచ్చేసరికి ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. వారం రోజులుగా మరింత తీవ్రంగా ఉంటున్నాయి. అందుకు తగ్గట్టుగానే విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోతోంది.

ఈ నెల గుండె గు'భిల్లు'

ఉదాహరణకు రెండు ఫ్యాన్‌లు, ఒక ఏసీ, మూడు ట్యూబులైట్‌లు ఉన్న ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబ విద్యుత్ వినియోగం ఏప్రిల్‌లో సగటున 185 యూనిట్లు నమోదైంది. అంటే రూ.800 బిల్లు చెల్లించాల్సి వచ్చింది. ఈ నెలలో అదే తరహా కుటుంబ బిల్లు చూస్తే 300 యూనిట్లు దాటిపోయింది. అంటే రూ.1,500 చెల్లించాలి. ఇలా ప్రతి కుటుంబంలో స్థాయిని బట్టి వినియోగం పెరిగింది. గతేడాది మేతో పోలిస్తే ఈ ఏడాది వినియోగం భారీగా పెరిగింది. గతేడాది మే 10న 11.575 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడారు. తాజాగా ఈ నెల 10న సుమారు ఐదారు మిలియన్ యూనిట్లు అదనంగా వాడారని తేలింది. ఇలా ఈ నెలలో 10 నుంచి 16 వరకు పరిశీలిస్తే గతేడాది కంటే ఐదారు మిలియన్ యూనిట్లు అదనంగా వాడినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

గృహ వినియోగం 50 శాతం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లా విద్యుత్ వాడకంలో (జగ్గంపేట విద్యుత్ డివిజన్‌తో కలిపి) 45శాతంతో మొదటి స్థానంలో ఉంది. కాకినాడ నగరంతో పాటు మెట్ట ప్రాంత మండలాల్లో అత్యధికంగా కరెంటు వాడుతున్నారు. రామచంద్రపురం డివిజన్‌తో కలిపి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 30 శాతంతో రెండో స్థానం, 20శాతంతో రాజమహేంద్రవరం(నిడదవోలు సబ్ డివిజన్ మినహా) మూడో స్థానంలో ఉన్నాయి. రంపచోడవరం విద్యుత్ సబ్‌డివిజన్‌లో మిగిలిన ఐదు శాతం వినియోగం నమోదైంది. గృహవిద్యుత్ వినియోగం 50శాతం పైనే ఉంది. వేసవికి ముందు రోజుకు 16 మిలియన్ యూనిట్లు ఉంటే ప్రస్తుతం 17 నుంచి 20 మిలియన్ యూనిట్లు వాడుతున్నారు. ఈ నెల 13న 20.08 మినియన్ యూనిట్లు క్రాస్ చేసింది.

నిరంతరాయంగా సరఫరా

విద్యుత్ వినియోగం పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నారు. గతంలో ప్రతి వేసవిలోనూ విద్యుత్‌కోతలతో ప్రజలు నరకం చూసేవారు. ప్రస్తుతం పెరుగుతోన్న వినియోగానికి తగ్గట్టు ఉత్పత్తికి ఢోకా లేకపోవడంతో కోతల ఊసే లేదు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతుంటే డివిజన్ స్థాయిలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందిస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు.

రోజువారీ విద్యుత్ మొత్తం వినియోగం (మిలియన్ యూనిట్లు)

గతేడాది	వినియోగం	ఈ ఏడాది	వినియోగం
10.05.2022	11.575	10.05.2023	18,840
11.05.2022	11.485	11.05.2023	18.925
12.05.2022	14.010	12.05.2023	19.186
13.05.2022	15.014	13.05.2023	20.082
14.05.2022	16.567	14.05.2023	19.917
15.05.2022	16.783	15.05.2023	20.620
16.05.2022	17.316	16.05.2023	20.615

ఈ నెలలో రోజువారీ వినియోగం (మిలియన్ యూనిట్లు)

తేదీ	మొత్తం	గృహ వినియోగం
09.05.2023	18.71	7.48
10.05.2023	18.84	7.54
11.05.2023	18.93	7.57
12.05.2023	19.19	7.67
13.05.2023	20.08	8.03
14.05.2023	19.92	7.97

ఉమ్మడి తూర్పులో..

(నిడదవోలు సబ్ డివిజన్ మినహా)

మొత్తం విద్యుత్ కనెక్షన్లు	:	19,000
గృహ విద్యుత్ కనెక్షన్లు	:	16,23,138
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు	:	52,000
ఆక్వా చెరువులకు కనెక్షన్లు	:	11,000

డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి



వేసవి దృష్ట్యా వినియోగం పెరిగినప్పటికీ సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి ఉంది. గతంలో మాదిరిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోతలు ఎక్కడా విధించడం లేదు. అత్యవసర మరమ్మతులు, లైన్‌లలో నిర్వహణలోపాలు తలెత్తినప్పుడు అంతరాయం ఏర్పడుతోంది. 24 గంటలు విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఇబ్బంది లేదు. భవిష్యత్తు అవసరాలకు పూర్తిగా విద్యుత్ అందుబాటులో ఉంది.

– పి.వి.ఎస్.మూర్తి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ప్రమోషన్లు

కాకినాడ సిటీ: పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం వివిధ కేటగిరిలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రమోషన్లు ఇచ్చేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలుంటే షెడ్యూల్ తేదీల్లో సంబంధిత తనిఖీ అధికారి కౌంటర్ సిగ్నేచర్‌తో విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 17న మొదటి, రెండో లాంగ్వేజ్‌లకు సంబంధించి, వీటిపై అభ్యంతరాలను ఈ నెల 18, 19 తేదీల్లో స్వీకరిస్తారన్నారు. ఫైనల్ లిస్టును ఈనెల 20న ప్రచురిస్తారని డీఈవో పేర్కొన్నారు. వీరికి 21, 22 తేదీల్లో విల్లింగ్ లెటర్‌ను ఇస్తారన్నారు. విల్లింగ్ లేని అభ్యర్థులు నాట్ విల్లింగ్ దరఖాస్తులపై వ్యక్తిగత ధ్రువీకరణతో పాటు సంబంధిత తనిఖీ అధికారి కౌంటర్ సిగ్నేచర్‌తో సమర్పించాలన్నారు. బదిలీ కౌన్సెలింగ్‌లో ఎటువంటి నాట్ విల్లింగ్‌లు అనుమతించరని స్పష్టం చేశారు.

ఎల్డర్లీ కేర్ టేకర్స్‌గా యువతకు ఉపాధి

రాజానగరం: వృద్ధాశ్రమాలు, సంరక్షణాలయాలలో వృద్ధులకు సేవలందిస్తూ, వారికి సంరక్షణగా ఉండేందుకు సేవాభావంతో కూడిన యువతకు ఎల్డర్లీ కేర్ టేకర్స్‌గా ఉపాధి కల్పించనున్నారు. ఆసక్తి ఉన్న వారికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా కేంద్రంలో ఎల్డర్లీ కేర్ టేకర్ నాన్ క్లినికల్ పేరిట త్వరలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని జిల్లా ఈడీ అల్లంరాజు శ్రీరామచంద్రమూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. వృద్ధులపై సానుభూతితో నమ్మకంగా సేవలందించగల, దేహదారుఢ్యంతో ఉన్న 18 నుంచి 35 ఏళ్ల వయసు, 10వ తరగతి కనీస విద్యార్హతగా ఉన్న 30 మంది యువతీ, యువకులను ఎల్డర్లీ కేర్ టేకర్స్‌గా తీసుకుంటామన్నారు. వీరికి రెండు నెలల వ్యవధిలో 80 గంటల పాటు బోధన, 120 గంటలు ప్రాక్టికల్స్ శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి కలవారు 98487 29819 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీఎం జగన్ మైనార్టీల పక్షపాతి

- హజ్ యాత్రలకు అందిస్తున్న సహాయంపై కృతజ్ఞతలు
- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హజ్ యాత్రకు బయలుదేరే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హజ్ కమిటీ విమాన ప్రయాణానికి నిర్ణయించిన అధిక టికెట్ ధర వల్ల రాష్ట్రంలోని ముస్లింలు ఇబ్బంది పడకుండా ముఖ్యమంత్రి జగన్ పెద్ద మనసుతో ఈ సంవత్సరం మక్కా షరీఫ్ హజ్ యాత్రకు వెళ్లే హజీలకు ప్రత్యేక ఆర్థిక సహాయం కింద రూ.14.51 కోట్లు విడుదల చేయడం అభినందనీయమని ఖాదర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ.80 వేల వంతున 1,813 మంది యాత్రికులకు అవుతున్న ఖర్చును జగనన్న ప్రభుత్వం భరిస్తోందని వివరించారు. సాంకేతికంగా ఎన్ని ఇబ్బందులున్నా హైదరాబాద్, బెంగళూరు ఎంబర్కేషన్ ధరలతో సమానంగా టిక్కెట్ ధరలను ఖరారు చేసి గన్నవరం ఎయిర్ పోర్టు పంపిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ముస్లింలు ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటారని ఖాదర్ స్పష్టం చేశారు. మైనార్టీల పక్షపాతిగా ఆయన తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జీవితంలో ఒక్కసారైనా హజ్ పవిత్ర యాత్రకు వెళ్లాలనుకున్న సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ముస్లింలకు ఎంతో ఆర్థిక వెసులుబాటునిస్తోందని ఆయన పేర్కొన్నారు. ముస్లిం హజ్ యాత్రకు ఆర్థిక సాయం అందించే విషయంలో కృషి చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ వ్యవహారాల మంత్రి అంజాద్ బాషా, మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు జనాబ్ ఖాదర్ బాషా, ఎంపీ చింతా అనురాధకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవగుప్తం రోడ్డు విస్తరణకు భూమిపూజ

రూ. 20 కోట్లు సీఆర్ఎఫ్ నిధులు మంజూరు



ఎంట్రుకోనలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక ప్రధాన రహదారి గుడ్డివానిచింత నుంచి సామంతకుర్రు వరకు విస్తరించి ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణకు సీఆర్ఎఫ్ నిధులు రూ.20 కోట్లు మంజూరయ్యాయని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఎంట్రుకోనలో దేవగుప్తం రోడ్డు విస్తరణకు మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ బుధవారం భూమి పూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఎంట్రుకోన, దేవగుప్తం, గుండెపూడి, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, డి.రావులపాలెం గ్రామాల రాకపోకలకు ఈ రోడ్డు ప్రధానమైనదని, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలను ఈ రోడ్డు అనుసంధానం చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు ఈ రోడ్డుని నిర్లక్ష్యం చేశాయని, కనీసం మరమ్మతులు కుడా చేయలేదన్నారు. తొలి దశలో గుడ్డివానిచింత నుంచి డి.రావులపాలెం వంతెన వరకు రోడ్డు విస్తరణ ఉంటుందని, ఎంట్రుకోనలో ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణం, దేవగుప్తం పొడవునా సీసీ రోడ్డు, మిగిలినదంతా బీటీ రోడ్డు నిర్మిస్తామన్నారు. డి.రావులపాలెం సెంటర్ నుంచి సామంతకుర్రు వరకు కాలువ పొడవునా రివిట్‌మెంట్ నిర్మాణం చేయవలసి ఉందని, ప్రతిపాదనలు చేశామని మంత్రి తెలిపారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణలో నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి విశ్వరూప్‌తో కలసి పలుసార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని కలసి రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పారదర్శకంగా అమలు కావాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, తుని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆర్అండ్‌బీ జిల్లా అధికారి డి.రాము, డీఈ కేఎస్ రాఘవరావు, ఏఈ కె.అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఐటీఐ రూటు.. ఉపాధికి చోటు

- పారిశ్రామిక శిక్షణ ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు జూన్ 6 తుది గడువు
- కోనసీమ జిల్లాలో 2,564 సీట్లు



కాకినాడ ప్రభుత్వ ఐటీఐ

రాయవరం: పదవ తరగతి పూర్తి కాగానే విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అంటూ ఆలోచన చేస్తారు. అధిక శాతం మంది ఇంటర్మీడియెట్‌లో చేరుతారు. పలువురు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)కు ప్రాధాన్యమిస్తున్నారు.

18ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ దోహదపడుతుంది.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్స్‌మేన్ సివిల్, ఇనుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు.

డ్రోన్ టెక్నాలజీపై స్వల్ప కాలిక కోర్సు

ఈ ఏడాది కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశ పెట్టారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్‌లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టారు. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది, ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.

రెండేళ్ల కాల పరిమితితో..

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మేన్ సివిల్, ఆర్అండ్ఏసీ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, టర్నర్

ఏడాది కాల పరిమితితో..

మెకానిక్ డీజిల్. సీవోపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు లేవు. కాకినాడ జిల్లాలో మాత్రమే రెండు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలో 15 ఐటీఐలు ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో 2,564 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 12 ప్రైవేట్ యాజమాన్యంలో 1,704 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 4,996 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరగోరే విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

– ఎంవీజీ వర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, కాకినాడ

క్లుప్తంగా

హోం మంత్రిని కలిసిన డీఐజీ



కొవ్వూరులో హోం మంత్రి వనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొవ్వూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన పోలీసు బదిలీల్లో భాగంగా విజయవాడ ఏసీబీ నుంచి జీవీజీ అశోక్‌కుమార్ బదిలీపై ఏలూరు డీఐజీగా వచ్చారు. నూతనంగా విధుల్లో చేరిన అశోక్‌కుమార్ మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు.

వేగ ఆభరణాల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: వేగ జ్యూయలర్స్ రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టన్‌లో ఈ నెల 17,18 తేదీలలో బంగారు ఆభరణాల ప్రదర్శన, అమ్మకాలను జరుపుతున్నట్టు నిర్వాహకులు నవీన్, సుధాకర్ తెలిపారు. తమ సంస్థ విజయవాడ, హైదరాబాద్ నగరాలలో బంగారు, వజ్రాభరణాల షోరూంలను దిగ్విజయంగా నడుపుతున్నట్టు వారు చెప్పారు. మంగళ ప్రదమైన వేడుకలకు, వివాహాది శుభకార్యాలకు కావలసిన విశిష్ట ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. ప్రత్యేక ఆఫర్‌గా ప్రతీ రెండు లక్షల రూపాయల బంగారం, వజ్రాల కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. పోల్కీ జ్యూయలరీ కొనుగోలుపై తరుగు, మజూరీ (మేకింగ్ చార్జీలు) ఉండవని చెప్పారు. ప్రసిద్ధ ఆభరణాల కోసం దేశంలోని పలు ప్రాంతాలకు తిరిగే శ్రమ లేకుండా ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని తెలిపారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

అల్లవరం: బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని రెబ్బనపల్లికి చెందిన మల్లాడి ఏసుబాబు (43) మంగళవారం అర్ధరాత్రి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ తెలిపిన వివరాలు.. మృతుడు ఏసుబాబు కుటుంబ సభ్యులతో తరుచు ఘర్షణ పడేవాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోడు. మంగళవారం రాత్రి ఇంటి వాసానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున ఏసుబాబు ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఏసుబాబు మృతిపై తల్లి మల్లాడి నరసమ్మ ఆదివారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు నేపథ్యంలో అనుమాన స్పద మృతి కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని ఎస్సై తెలిపారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఏపీ రెసిడెన్షియల్ ఎంట్రన్స్‌కు ఏర్పాట్లు

- 20న 5వ తరగతి, జేసీ, డీసీ ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,661 మంది విద్యార్థులు



రాయవరం: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అధికారులు సర్వం సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 20వ తేదీన ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గత నెల నాల్గవ తేదీన దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. గత నెల 28వ తేదీ వరకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా భూపతిపాలెం(బాలుర), కాకినాడ మండలం తుని(బాలికల), జగన్నాథగిరి వద్ద ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేరేందుకు తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 80 వంతున సీట్ల భర్తీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలకు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రవేశ పరీక్షలు రాయనున్న 3,661 మంది

ఏపీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు ఈ నెల 20న రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురంలో నిర్వహించనున్నారు. 5, 6, 7, 8వ తరగతిలో ప్రవేశ పరీక్షను ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు రెండు పరీక్షా కేంద్రాల్లో 259 మంది హాజరు కానున్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు ఏడు కేంద్రాల్లో 1,466 మంది హాజరు కానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 17 మంది, జేసీ, డీసీ ప్రవేశ పరీక్షకు 40 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి అమలాపురంలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాకినాడలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 384, 6వ తరగతికి 65, 7వ తరగతికి 29, 8వ తరగతి ప్రవేశ పరీక్షకు 37 మంది హాజరు కానున్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్షకు ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో 1,364 మంది పరీక్షకు హాజరు కానున్నారు. ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ టైపులో ఉంటుంది. పరీక్షల నిర్వహణకు తూర్పుగోదావరి జిల్లాకు భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అప్పలరాజుగూడెం రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహస్వామి, కాకినాడ జిల్లాకు తుని, ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి జిల్లా కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

ఆదేశాలు జారీ చేశాం



ఏపీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా, విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మూడు జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలిచ్చాం. అరగంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

త్రైమాసిక పన్నును ఉపసంహరించుకోవాలి



సమావేశానికి హాజరైన లారీల యజమానులు

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రవాణా వాహనాలపై విధించిన త్రైమాసిక పన్నును ఉపసంహరించాలని సెంట్రల్ డెల్టా లారీ ఓనర్స్ అసోసియేషన్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఈదరపల్లిలో లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సెస్సులు, పన్నులు విధిస్తోందన్నారు. త్రైమాసిక పన్ను విధించిన ఫలితంగా రవాణా రంగం కుదేలవడంతో పాటు ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో అమలాపురం అధ్యక్షుడు నల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీ అభ్యర్థుల జీవితాల్లో జగనన్న వెలుగులు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఎమ్మెల్యే రాజాకు వినతిపత్రం అందజేసిన టైమ్ స్కేల్ ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం సిటీ: రెండు దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి హయాంలో న్యాయం జరిగిందని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో టైమ్ స్కేల్ ఉపాధ్యాయులు (డీఎస్సీ-1998 అభ్యర్థులు) ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించవలసిందిగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు మాట్లాడుతూ మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల సర్వీసును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సంవత్సర కాలంలో తమకు ప్రభుత్వం పది నెలల జీతం మాత్రమే చెల్లిస్తుందని, దానిని 12 నెలలకు పెంచాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజా డీఎస్సీ అభ్యర్థులకు తెలిపారు.. చొల్లంగి కేశవకుమార్, సెక్రటరీ కోటిపల్లి రాంబాబు, రేలంగి అనిత, సుబ్రహ్మణ్యం, అల్లు అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

‘ఈ’ స్టాంపింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఐజీ నాగలక్ష్మి, చిత్రంలో కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి, స్టాక్ హోల్డింగ్ ప్రతినిధులు

కాకినాడ లీగల్: రిజిస్ట్రేషన్‌కు త్వరలో రానున్న ‘ఈ’ స్టాంపింగ్ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, వాటిని ఉపయోగించే అంశంపై కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల సబ్ రిజిస్ట్రార్లు, స్టాంప్ వెండర్లకు స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ ఎ.నాగలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ నాగలక్ష్మి మాట్లాడుతూ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల కొరత ఉండడం, తగినన్ని సమయానికి రాకపోవడంతో క్రయవిక్రయదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ‘ఈ’ స్టాంపింగ్ విధానాన్ని తీసుకొస్తోందని చెప్పారు. ఈ విధానం ద్వారా నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లకు బదులుగా దస్తావేజుల రిజిస్ట్రేషన్ సమయంలో ఈ స్టాంపింగ్ చేయించుకోవచ్చన్నారు. ఇది నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లకు సమానం అన్నారు. దీనిపై క్రయ విక్రయదారులకు ఎటువంటి అనుమానాలు లేకుండా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ స్టాంపింగ్ వాడే విధానాన్ని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ప్రతినిధులు డెమో ద్వారా అవగాహన కల్పించారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్, కాకినాడ, రాజమహేంద్రవరం సబ్ రిజిస్ట్రార్లు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

చందాదారుల భద్రతే లక్ష్యంగా ‘ఈ-చిట్స్’: ఉమ్మడి జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ రామలక్ష్మి పట్నాయక్

చిట్‌ఫండ్ కంపెనీల్లో జరుగుతున్న మోసాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఉమ్మడి జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ చిట్ కంపెనీలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే అన్ని లావాదేవీలు నిర్వహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. దీనికి సంబంధించి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఆన్‌లైన్ విధానంలో చిట్ కంపెనీల లావాదేవీలు పరిశీలించి ఆమోదించాలని సూచించారు. ఈ విధానం ద్వారా చిట్ కంపెనీలు మోసాలు, అవకతవకలకు తావులేకుండా సక్రమంగా నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికితోడు ఈ స్టాంపింగ్ విధానం కూడా త్వరలో అందుబాటులోకి వస్తుందని, దీనిద్వారా కూడా భద్రత ఉంటుందని చెప్పారు.

● కా కేక!



అంబాజీపేట: ఒంగోలు ఆవుకు పుంగనూరు దూడ జన్మించి అందరినీ అబ్బురపరిచింది. గంగలకుర్రు సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావుకు చెందిన ఒంగోలు ఆవుకు పుంగనూరు దూడ మంగళవారం రాత్రి జన్మించింది. ఒంగోలు ఆవు తొలి చూలుదని, తమ ఇంట పుట్టినదేనని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ సలహాతో, పుంగనూరు జాతి ఇంజెక్షన్ చేయించినట్లు తెలిపారు. పుట్టిన దూడ 20 అంగుళాల ఎత్తు, 24 అంగుళాల పొడవు ఉందని చెప్పారు.

ఒంగోలు ఆవుకు జన్మించిన పుంగనూరు దూడ →

స్టాక్ పాయింట్లలో జాగ్రత్తలు తీసుకోవాలి



రంగంపేట హైస్కూల్లో కేవీకే కిట్లను పరిశీలిస్తున్న నరసింహారెడ్డి

రంగంపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జగనన్న విద్యా కానుకల (జేవీకే) స్టాక్ పాయింట్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం.నరసింహారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్ల గదులను ఆయన పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బ్యాగులు, బెల్టులు ఎలా భద్రపరిచారో పరిశీలించారు. అనంతరం పదో తరగతి తప్పిన విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి పలు ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, పూర్తి స్థాయిలో జగనన్న విద్యా కానుకలు అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు సాయి, దుర్గారావు, పార్టుటైమ్ ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీను

గోపాలపురం: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం గోపాలపురం మండలం గుడ్డిగూడెంలో జరిగింది. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ముప్పిడి శ్రీను(45) ఉదయం ఉపాధి పనులకు వెళ్లి ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో పొలంలో ఉన్న గేదెలను నీటి కోసం చెరువులోకి దింపాడు. చెరువులోకి దిగిన గేదెలు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో గేదెలను బయటకు తోలడానికి చెరువులోకి దిగాడు. చెరువులో నీరు ఎక్కువగా ఉండటంతో నీటిలో చిక్కుకుపోయాడు. దీంతో ఊపిరి ఆడక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టరు ఢీకొని ఉపాధి ఏపీఎంకు గాయాలు

కాజులూరు: గొల్లపాలెంలో బుధవారం ట్రాక్టరు ఢీకొని కాకినాడ రూరల్ ఉపాధి ఏపీఎం నామ సత్యనారాయణ తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజులూరుకు చెందిన నామ సత్యనారాయణ కాకినాడ రూరల్ మండలంలో ఉపాధి ఏపీఎంగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని తన మోటారు బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా గొల్లపాలెం శ్రీరామా నర్సింగ్‌హోం ఎదుట మలుపు వద్దకు వచ్చే సరికి ద్రాక్షారామ వైపునకు వెళుతున్న ట్రాక్టరు ఒకటి వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఏపీఎం సత్యనారాయణ బైక్ నుజ్జునుజ్జు అవ్వగా ఆయన కాలుకి తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ట్రాక్టరు డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఏపీఎం సత్యనారాయణ బైక్‌పై నుంచి దూసుకువెళ్లి పక్కనే ఉన్న గోడను ఢీ కొని ఆగింది. గొల్లపాలెం ఎస్సై తులసీరామ్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ నిర్వహిస్తున్నారు.

వడదెబ్బకు పారిశుధ్య కార్మికుడి మృతి



వడదెబ్బకు గురై మృతి చెందిన రాంబాబు

కాజులూరు: గొల్లపాలెం శివారు ధనలక్ష్మీపేటకు చెందిన కావూరి రాంబాబు (64) వడదెబ్బకు గురై బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కావూరి రాంబాబు స్థానిక గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పని ముగించుకుని ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు గమనించి గ్రామంలోని ఒక ప్రైవేటు వైద్యునితో చికిత్స చేయించారు. బుధవారం ఉదయం పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లే సరికే రాంబాబు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పి.గన్నవరంలో..



పల్లపు రాజు (ఫైల్)

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలో హెల్పర్‌గా పనిచేస్తున్న దంగేటి పల్లపురాజు (40) బుధవారం వడ దెబ్బకు గురై మరణించాడు. మంగళవారం నాటి వడగాడ్పులకు అతడు బాగా నీరసించిపోయాడు. బుధవారం ఉదయం అతడు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చే సరికి అతడు మృతి చెందాడు. దీనిపై తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య రత్నకుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు పరామర్శించారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే మూడవ నంబరు ప్లాట్‌ఫారంపై బుధవారం సాయంత్రం రైల్వే పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. మూడవ నంబరు ప్లాట్‌ఫారం చివరిలో తాగునీటి కుళాయిల వద్ద పడి ఉన్న మృతదేహాన్ని ప్రయాణికులు గుర్తించి రైల్వే ఎస్ఎస్‌కు తెలిపారు. ఎస్ఎస్ బి.శ్రీధర్ ఈ విషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో కాకినాడ రైల్వే ఎస్సై ఎస్.రవికుమార్ ఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. మృతదేహం వద్ద ఎటువంటి వివరాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాల వయసు ఉండవచ్చని, నలుపు పుల్‌హ్యాండ్ షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలకు 94407 02328కు సంప్రదించాలన్నారు.

మహిళ మెడలోని గొలుసు తెంచుకుపోయిన దుండగులు

కాకినాడ రూరల్: ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సిద్ధార్థ నగర్‌కు చెందిన మహిళ పబ్బిసెట్టి మహాలక్ష్మి మెడలోని ఆరు కాసుల బంగారు గొలుసు, సూత్రాలు, నల్లపూసలను బుధవారం దుండగులు తెంచుకొని పోయారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో అటు జేఎన్‌టీయూకే ఇటు జిల్లా క్రీడా మైదానం, మరో వైపు చల్లని శీతల పానీయాలు, అల్పాహారాలు లభిస్తుండడంతో జనం సందడి ఎక్కువగా ఉంటుంది. డీఎస్ఏ గ్రౌండ్‌లో ఇద్దరు మనవలను ఈత నేర్పించేందుకు తీసుకువెళుతుండగా మధ్యాహ్నం 3.45 గంటల ప్రాంతంలో గేట్ వద్ద ఒక అపరిచిత వ్యక్తి జాకెట్‌పై ఏదో పడిందని మహాలక్ష్మికి చెప్పాడు. ఆమె కంగారు పడి చూసుకునే లోపే దగ్గరకు వచ్చి మెడలోని బంగారు గొలుసు, నల్లపూసలు గొలుసు లాక్కున్నాడు. ఆమె తేరుకుని కేకలు వేసేలోపే మరో వ్యక్తితో కలసి బైక్‌పై ఉడాయించాడు. బాధితురాలి అల్లుడు రామిశెట్టి నరసింహరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. సీఐ ఆ ప్రాంతానికి వెళ్లి అనుమానితుల కోసం గాలింపు చేపట్టారు. సీసీ ఫుటేజీలు పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. చోరీ సొత్తు విలువ రూ.లక్ష ఉంటుందని రైటర్ నాగేశ్వరరావు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పి.గన్నవరం: నాగుల్లంక శివారు పెదకందాలపాలెంలో మద్యానికి బానిసైన ఒక వ్యక్తి బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యల్లమెల్లి చలపతిరావు (50) తరచూ మద్యం సేవించి, భార్యను తిడుతూ ఉంటాడు. బుధవారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతడిని భార్య నిలదీసింది. దీంతో అతడు ఇంట్లోకి వెళ్లి తలుపులు బిగించుకుని ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుగొట్టి లోనికి వెళ్లే సరికి అతడు మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



దేవప్రసాద్ (ఫైల్)

తొండంగి: మండలంలోని ఏ.కొత్తపల్లిలో బుధవారం వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడ్డాడు.. తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏ.కొత్తపల్లి గ్రామం పల్లపు వీధికి చెందిన ఉమ్మిడి దేవప్రసాద్(35) ఆటోలో ఉల్లిపాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన ఇంటి వద్ద విద్యుత్ స్తంభం నుంచి ఇంటికి వేసిన విద్యుత్‌వైరు తెగిపడటంతో ఎవరికైనా తగిలి షాక్‌కు గురవుతారని భావించి వైరును తప్పించే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని సోదరుడు ఉమ్మిడి వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ వివరించారు.

కన్నబిడ్డలు నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లి ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంకు చెందిన పిల్లి నాగమణి తన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెకు కుమారుడు నాగేంద్ర వరప్రసాద్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృద్ధాప్యంలో వారెవరూ తనను చూడటం లేదని, పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.